క్లుప్తంగా

పేదలకు బియ్యం వితరణ



సరకులు అందజేస్తున్న ఆంధ్ర యూత్‌ సభ్యులు

కడప ఎడ్యుకేషన్‌: తమ సంపాదనలో కొంత భాగం నిరుపేదలకు ఖర్చు చేయాలని జెకె జనం కోసం యూత్‌ వెల్ఫేర్‌ సొసైటీ వ్యవస్థాపకులు లయన్‌ పటాన్‌ ఖాదర్‌బాషా అన్నారు. కడప ఎతిమ్‌ ఖానా ఫంక్షన్‌ హాల్‌లో ఆంధ్ర యూత్‌ వారి ఆధ్వర్యంలో 200 పేద ముస్లిం కుటుంబాలకు బియ్యం ప్యాకెట్లు, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్‌ మాసంలో పేదల ఆకలి తీర్చడమే కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైరోస్‌, ఆన్సర్‌, తాజ్‌, కరీంబాషా, జఫరుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కడప ఎడ్యుకేషన్‌: కడప అవోపా విద్యా నిధి చైర్మన్‌ డాక్టర్‌ మాలేపాటి వెంకట్రావు ఆధ్వర్యంలో కడప ఎన్జీవోస్‌ కాలనీలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఎముకలు సాంద్రత వైద్య పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఫోర్డ్‌ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డాక్టర్‌ మాలేపాటి వెంకట్రామ్‌ రోగులకు పరీక్షలు చేసి సలహాలు అందజేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ఆలయ చైర్మన్‌ నేతిరెడ్డయ్య, ఆలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

14న హోలీ సంబరాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: ఈ నెల 14న నిర్వహిస్తున్న హోలీ సంబరాలను జయప్రదం చేయాలని సేవాలాల్‌ బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు అంజినాయక్‌, నాగేశ్వరనాయక్‌ కోరారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి హోలీ సంబరాల పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్‌ బంజారా సంఘం సభ్యులు అప్పానాయక్‌, సోనికుమార్‌ నాయక్‌, ఈశ్వర్‌ నాయక్‌, వెంకటరమణ నాయక్‌, తదితరులు పాల్గొన్నారు.

కట్టడాల కూల్చివేత దారుణం

కడప కార్పొరేషన్‌: కాశిరెడ్డి నాయన పేరిట వెలసిన జ్యోతి క్షేత్రంలో కట్టడాలను అటవీ అధికారులు కూల్చివేయడం అన్యాయమని సాయి యువజన సేవా సంఘం అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెడుతూ, నీడ లేనివారికి ఆశ్రయం కల్పిస్తున్న కాశిరెడ్డి నాయన క్షేత్రంలోని కట్టడాలను కూల్చివేయడం సరికాదన్నారు. కాశిరెడ్డి నాయన క్షేత్రంలో భక్తులు హుండీలో డబ్బులు వేయరని, వారి శక్తి మేరకు ధాన్యం, కూరగాయాలు వితరణ చేస్తారన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలన్నారు.

వక్ఫ్‌ సవరణ బిల్లు రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌ బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్‌ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్‌ పేర్కొన్నారు. నగరంలోని రవీంద్ర నగర్‌ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ఆదివారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌ సవరణ చట్టం–2024 రద్దు చేయకపోతే దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా పరిపాలన చేస్తూ ప్రజల మధ్య గొడవలు సృష్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బాబూబాయ్‌, ముఫ్తీ రహిముల్లాఖాన్‌ సాహెబ్‌, గాలి చంద్ర, చంద్రశేఖర్‌, భాస్కర్‌గౌడ్‌, మహమ్మద్‌ అలీఖాన్‌, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు అభివృద్ధి చేయాలి

కడప ఎడ్యుకేషన్‌: రాష్ట్రంలో ఉర్దూ పాఠశాలలను అభివృద్ధి పరిచే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని రాష్ట్ర ఉర్దూ టీచర్స్‌ అసోసియేషన్‌ ఉర్దూ పాఠశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్లు ఇస్మాయిల్‌, సయ్యద్‌ రహమతుల్లా, రాష్ట్ర సోషల్‌ మీడియా కన్వీనర్‌ ఖాన్‌ సలీంఖాన్‌ కోరారు. రాష్ట్రంలోని మైనర్‌ మీడియా, ఉర్దూ, తమిళం, కన్నడ, ఒరియా పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. 11 జీవో రద్దు అనంతరం రూపొందించే ఉత్తర్వులతో మైనర్‌ మీడియా పాఠశాలలకు మినహాయింపులు తప్పకుండా ఉండాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు సూచించారు. అటు పేద పిల్లల చదువులకు భరోసా కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు.

అసౌకర్యాల స్టేడియం









పెచ్చులూడుతున్న పైకప్పు.. దెబ్బతిని ఎగుడుదిగుళ్లుగా తయారైన వాకింగ్‌ ట్రాక్‌.. అధ్వానంగా కనిపిస్తున్న వ్యాయామ గది.. నిర్మాణం పూర్తిచేసినా అందుబాటులోకి రాని ఫుట్‌బాల్‌ కోర్టు.. అసౌకర్యాల నిలయంగా కనిపిస్తున్న కడప మున్సిపల్‌ స్టేడియం దుస్థితి ఇదీ. క్రీడాకారులు ఆడుకునేందుకు వీలుగా ఈ మైదానం నిర్మించారు. అసౌకర్యాలతో నేడు ప్రతిభ కలిగిన క్రీడాకారులు, విద్యార్థులు ఆటలకు శాపంగా మారింది. మున్సిపల్‌ కమిషనర్‌ స్పందించి స్టేడియంలో సౌకర్యాలు కల్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్‌, కడప

ఇది రాజ్యాంగ విరుద్ధం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కడప సెవెన్‌రోడ్స్‌: ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలకు అప్పగించడం రాజ్యాంగ మూల సూత్రానికి విరుద్ధం అవుతుందని రాయలసీమ హ్యూమన్‌ రైట్స్‌ వెల్ఫేర్‌ అధ్యక్షుడు జేవీ.రమణ, ప్రజా సంఘాల నాయకులు సంగటి మనోహర్‌, లెనిన్‌ ప్రసాద్‌, రమేష్‌ బాబు, రవికుమార్‌ అన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌ వద్ద అంబేడ్కర్‌ సర్కిల్‌లో రాయలసీమ మాలల మహాసభ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు రద్దు చేసిన వర్గీకరణను ఆరుగురితో ఒప్పించి రాష్ట్రాలకు అప్పగించడం దారుణమన్నారు. మాల మాదిగలను ఓటు బ్యాంకుగా మలుచుకోవడానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేసిందన్నారు. మాలల ఆత్మీయ సమావేశానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌, సునీల్‌ బాబు నరసింహ, రాకేష్‌, వై శేఖర్‌, బండారు ఓబులేసు, కొప్పుల రామకృష్ణ, బండి నవీన్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఇంటర్‌ ప్రథమ సంవత్సరం పరీక్షల ముగింపు సందర్భంగా విజయవాడ నుండి కడపకు బద్వేల్‌ సర్వీసులు నడుపనునట్లు బద్వేల్‌ డిపో మేనేజర్‌ తెలిపారు. ఈ నెల 13న విజయవాడ నుంచి కడపకు రాత్రి 8 గంటలకు బస్సు ఏర్పాటు చేశామన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధించేందుకు మరోమారు ఉద్యమానికి సన్నద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పిలుపునిచ్చారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నిత్య కరవులతో తల్లడిల్లుతున్న రాయలసీమ కేంద్ర బిందువు కడప జిల్లాలో రూ. 20 వేల కోట్ల అంచనా వ్యయం, 10 లక్షల టన్నులు సామర్థ్యం, ప్రత్యక్షంగా 25 వేలు, పరోక్షంగా 1 లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి డా.వై.ఎస్‌.రాజశేఖర్‌ రెడ్డి చిటిమిటి చింతల వద్ద బ్రహ్మణి ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. ఒప్పందం ప్రకారం స్టీల్‌ ప్లాంట్‌ నిర్మాణం పూర్తి చేయకుండా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలతో కేటాయింపులన్నీ రద్దు చేశారని ఆరోపించారు. స్టీల్‌ ప్లాంట్‌ స్థానంలో ప్రభుత్వమే ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని సిపిఐ, ప్రజాసంఘాల నేతృత్వంలో ధర్నాలు, నిరాహారదీక్షలు, పాదయాత్రలు, సంతకాల సేకరణ చేయడంతో 2014 మార్చి, 1న రాష్ట్ర విభజన బిల్లులో ఉక్కు ఫ్యాక్టరీ చేర్చారన్నారు. విభజనానంతరం 2014 మే, 7న ఆరంభించిన దీక్షలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉక్కు ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తుందని దీక్షలు విరమింపజేశారన్నారు. 2018 డిసెంబర్‌, 27న కంబాలదిన్నెలో రూ. 18 వేల కోట్ల అంచనా వ్యయంతో 30 లక్షల టన్నుల సామర్థ్యంతో రాయలసీమ స్టీల్‌ ప్లాంట్‌ నిర్మాణానికి శంకుస్థాపన చేసినా, మూడు వేల ఎకరాల భూమి కేటాయించినా నేటికీ నిర్మాణానికి నోచుకోలేదన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన అంశాల్లో ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, ఉక్కు ఫ్యాక్టరీపై పీఎం మోదీ ఎలాంటి చర్యలు తీసుకోకపోగా క్రిష్ణా జలాల పునఃసమీక్ష పేరుతో రాష్ట్రానికి, రాయలసీమకు తీవ్ర అన్యాయానికి ఒడిగట్టారన్నారు. రాష్ట్రానికి రావలసిన హక్కులు, అవకాశాలు రాబట్టడంలో నాయకులు ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. ఇటీవల రూ. 3.22 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 50,65,345 లక్షల కోట్ల బడ్జెట్లో కడప ఉక్కు ఫ్యాక్టరీ ప్రస్తావనే చేయకపోవడం చూస్తే డబుల్‌ ఇంజిన్‌ సర్కారు దగా కోరు మోసం స్పష్టం అవుతోందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జి వేణుగోపాల్‌, నాయకులు కేసి బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరవు



మాట్లాడుతున్న జి.ఈశ్వరయ్య

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరవైందని, వేంపల్లిలో జరిగిన సంఘటన ఇందుకు నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పసిపిల్లలు ఉన్న ఇంటిపై తెదేపా నాయకుడు జీవీ.రమణ, అతని అనుచరులు మారణాయుధాలు, పెట్రోల్‌తో దాడికి పాల్పడడం హేయమెన చర్య అన్నారు. ఇడుపులపాయలోని ఐఐఐటీలో ఎలాంటి నోటిఫికేషన్‌ లేకుండా ఉద్యోగాలు వేయించుకున్నారని, డ్వాక్రా మహిళల పేరుతో క్యాంటీన్‌ పొంది ప్రైవేట్‌ వారిరి లక్షల రూపాయల కమీషన్‌కు అమ్ముకున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుగా వృత్తిపరమైన విభేదాలుంటే ఆయన లేనప్పుడు మహిళా కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడడం ఏమిటని తెలిపారు. ఈ సంఘటన పై హోంమంత్రికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రైవేట్‌ పాఠశాల యాజమాన్య సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు భూమిరెడ్డి విజయభారతికి సీపీఐ అండగా ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ



ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్‌ మహేష్‌

కడప కల్చరల్‌: స్థానిక కృపా కాలనీలోని విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ చేశారు. న్యూ నేటివ్‌ మినిస్ట్రీస్‌ అధ్యక్షుడు పాస్టర్‌ పి.మహేష్‌, సిస్టర్‌ శాంతమ్మ ఆధ్వర్యంలో స్థానిక క్రైస్తవ మందిరంలో పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులచే ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. పాస్టర్లు మాట్లాడుతూ విద్యార్థులంతా దైవ భక్తి పెంచుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నూతన వస్త్రాలు అందజేశారు. భక్తులందరికీ అన్నదానం చేశారు.

నిరుపేదలకు నిత్యావసర సరకుల పంపిణీ



సరకులు పంపిణీ చేస్తున్న జాఫర్‌ హుసేన్‌, హెచ్‌ఓ డాక్టర్‌ సి.జమాల్‌ బాషా, తదితరులు

కడప కల్చరల్‌: కడప అగాడీ వీధిలోని అర్రహ్మాన్‌ సొసైటీ కార్యాలయంలో రిటైర్డ్‌ డిప్యూటీ కోఆపరేటివ్‌ రిజిస్ట్రార్‌ సయ్యద్‌ జాఫర్‌ హుస్సేన్‌ ఆధ్వర్యంలో పేదలకు ఆదివారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. అర్రహ్మాన్‌ ఇందాద్‌ వెల్ఫేర్‌ సొసైటీ అధ్యక్షులు షేక్‌ మహబూబ్‌బాషా మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకొని దాదాపు 500 కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీఎం పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆటా-పాట



శిల్పారామంలో నృత్య ప్రదర్శన

కడప కల్చరల్‌ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. పలు ప్రాచుర్యం పొందిన సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. సందర్శకులు కరతాళ ధ్వనులతో ప్రోత్సహించారు.

బ్రౌన్‌ గ్రంథాలయం సందర్శించిన ఏఆర్‌ డీఎస్పీ



తామ్ర పత్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కడప కల్చరల్‌: స్థానిక సీపీ బ్రౌన్‌ గ్రంథాలయాన్ని కడప ఏఆర్‌ డీఎస్పీ కె.శ్రీనివాస రావు, రిటైర్డ్‌ బ్యాంకు మేనేజర్‌ చంద్రమల్‌రెడ్డితో కలిసి ఆదివారం సందర్శించారు. గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్‌, డాక్టర్‌ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, జి.హరిభూషణ రావు గ్రంథాలయ నిర్మాణం, నిర్వహణకు డాక్టర్‌ జానమద్ది హనుమచ్ఛాస్త్రి, సీపీ బ్రౌన్‌ అందించిన కృషి గురించి వివరించారు. అనంతరం అందులోని పుస్తకాలను డీఎస్పీ ఆసక్తిగా పరిశీలించారు. వారు మాట్లాడుతూ విలువైన గ్రంథాలకు నిధి అయిన బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌. వెంకటరమణ, సుబ్రమణ్యం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళ మృతి

కడప అర్బన్‌: కడప రిమ్స్‌ పీఎస్‌ పరిధిలోని సాగర్‌ కాలనీలో నివాసముంటున్న షేక్‌ యాస్మిన్‌(32) ఈ నెల 5వ తేదీన కుటుంబ సమస్యలతో విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భర్త ఖాదర్‌బాషా గమనించి రిమ్స్‌లో చేర్పించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో వాసవాంబ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు



తెప్పోత్సవంలో వాసవీ కన్యకాంబ

కడప కల్చరల్‌: కడప నగరంలోని పాట్టి శ్రీరాములు వీధిలోని ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకాంబ ఆలయ వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలమూర్తిని పవిత్ర నదీజలాలతో అభిషేకించారు. ప్రత్యేక వేద పండితుల బృందాలు గణపతి, నవగ్రహ, వాస్తు, ఆయుష్షు, సుదర్శన హోమాలు నిర్వహించారు. నగరంలోని ఆర్యవైశ్య మహిళా భక్తులందరూ పెద్ద సంఖ్యలో హాజరై కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారిని పూలతో విశేషంగా అలంకరించారు. సాయంత్రం ఆలయం వెలుపల కృత్రిమంగా ఏర్పాటుచేసిన పుష్కరిణిలో ప్రత్యేకంగా రూపొందించిన తెప్పపై అమ్మవారిని కొలువుదీర్చి, మంగళ వాయిద్యాల మధ్య ప్రదక్షిణలు చేయించారు. ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

12న విజయవాడలో అంగన్వాడీల ధర్నా



కరపత్రాలు అవిష్కరిస్తున్న నాయకులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఈ నెల 12న విజయవాడ ధర్నా చౌక్‌లో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్‌ తెలిపారు నగరంలోని సీపీఎం కార్యాలయంలో మహా ధర్నా కరపత్రాలు ఆదివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలస కార్మికులకు ఉచిత రవాణా సౌకర్యం, నాణ్యమైన బియ్యం, గ్యాస్‌ బండ అందించాలని కోరారు. ప్రమాదంలో మృ తి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల నగదు, రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలన్నారు. భూమి లేని పేదలకు ఏడాదికి రూ.12 వేల నగదు, మూడు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 6 లక్షలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఉపాధి హామీ మేట్‌లకు రూ.5 వేల పారితోషికం ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఉపాధిని వ్యవసాయానికి అనుసంధానం చేసి పేదల పొట్ట కొడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్‌, రామ్మోహన్‌, సత్యనారాయణ, భైరవప్రసాద్‌, చిన్ని, శివకుమార్‌, రాహుల్‌, రవి, తదితరులు పాల్గొన్నారు

అక్రమ అరెస్టులతో పోరాటాలు ఆపలేరు



మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి, తదితరులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అంగన్వాడీలు ఈ నెల 10న చేపట్టిన చలో విజయవాడను అడ్డుకునేందుకు నోటీసులు జారీ చేయడం, అరెస్టు చేయడం తగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్‌.నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్‌ పేర్కొన్నారు. నగరంలోని హోచిమన్‌ భవన్‌లో విలేకరులతో ఆదివారం వారు మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమానికి ఒక వైపు పోలీసులు అనుమతి ఇచ్చి మరోవైపు అరెస్టులు, గృహ నిర్బంధం, నోటీసులు జారీ చేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులతో తమ ఉద్యమాలను ఆపలేరని, ఈ చర్యలు ప్రభుత్వానికి మంచిది కాదని హితవు పలికారు. ఈ సమావేశంలో జి.వేణుగోపాల్‌, కేసీ.బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న

కడప ఎడ్యుకేషన్‌: పశు వైద్య విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలు మానుకుని వారి న్యాయమైన డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్‌ చేశారు. పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అంకన్న మాట్లాడుతూ వెటర్నరీ విద్యార్థులు తమకు ప్రభుత్వం స్టైఫండ్‌గా రూ.7 వేలు, పీజీకి రూ.9వేలు, పీహెచ్‌డీకి రూ.10వేలు ఇస్తున్నారని, ఇప్పటి వరకూ పెంచలేదని ధర్నా చేస్తున్నారన్నారు. విద్యార్థులతో తక్షణమే చర్చలు జరిపి వారి డిమాండ్లు పరిష్కరించాల్సిన ప్రభుత్వం హాస్టల్‌ నుండి బయటికి పంపాలని ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. బెదిరింపులతో ఉద్యమాన్ని అణచివేయలేరని, ఉత్తర్వులు ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వరరెడ్డి, శివప్రసాద్‌, సుదర్శన్‌ పాల్గొన్నారు.

క్లెయిమ్‌లు విడుదల చేయాలని చలో ఢిల్లీ



పోస్టర్లను అవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: ఆంధ్ర ప్రదేశ్‌ సంక్షేమ బోర్డులో పెండింగ్‌గా ఉన్న క్లెయిమ్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్‌.నాగ సుబ్బారెడ్డి, ఏపీ బిల్డింగ్‌ అండ్‌ కన్‌స్ట్రక్షన్‌ వర్కర్స్‌ యూనియన్‌ అధ్యక్షుడు ఉద్దె.మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, జిల్లా అధ్యక్షుడు బి.రామాంజనేయులు డిమాండ్‌ చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో చలో ఢిల్లీ పోస్టర్లను ఆదివారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు అనేక సమస్యలతో జీవితం గడుపుతున్నారన్నారు. సుదీర్ఘ పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం 1996 తెచ్చిందని తెలిపారు. కార్మికులకు పని, ఆరోగ్యం, ఆహార భద్రత కల్పించాలని, రాయితీతో కూడిన రుణాలు, పిల్లల చదువులకు అయ్యే ఖర్చులకు ఉపకార వేతనాలు, వైద్య సౌకర్యం కల్పించి ఆదుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునఃప్రారంభిస్తామని మేనిఫెస్టోలో పెట్టామన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ సంక్షేమ బోర్డు అమలు చేయకపోవడం బాధకారమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కడప నగర అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు, ఏసోబు, మన్నెం నాగేశ్వరరావు, చల్ల బాలాజీ, ఎం.హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దదర్గా ఆవరణలో ఘనంగా ఇఫ్తార్‌



పెద్ద దర్గాలో జరిగిన ఇఫ్తార్‌లో ముస్లింలు

కడప కల్చరల్‌: ప్రముఖ సూఫీ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతమైన కడప అమీన్‌ పీర్‌ (పెద్ద) దర్గాలో ఆదివారం ఇఫ్తార్‌ ఘనంగా నిర్వహించారు. తొలుత ఉపవాస దీక్ష విరమణ ప్రార్థన చేసి నిర్వహించి ఫలాలను స్వీకరించారు. అనంతరం దర్గా మసీదులో జరిగిన మగ్రీబ్‌ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

జమాతే ఇస్లామీ హింద్‌ ఆధ్వర్యంలో

నగరంలోని బెల్లం మండీ మదరస జెహరాలో జమాతే ఇస్లామి హింద్‌ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్‌ విందు నిర్వహించారు. కార్యక్రమంలో మూవ్‌మెంట్‌ ఫర్‌ పీస్‌ అండ్‌ జస్టిస్‌ అధ్యక్షుడు అబ్దుల్‌ ఖదీర్‌, జమాతే ఇస్లామీ హింద్‌ రాష్ట్ర సలహా మండలి సభ్యులు షాకీర్‌ హుస్సేన్‌, మత గురువు మౌలానా ఆతిఫ్‌ ఫలాహి మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్‌ నిలుస్తుందన్నారు. పవిత్ర రంజాన్‌ మాసంలో అన్ని మతాల వారికి ఇఫ్తార్‌ విందు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం పవిత్రమైన రంజాన్‌ మాసం విశిష్టత, ఉపవాసాల లక్ష్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జమాత్‌ ఇస్లామీ హింద్‌ అధ్యక్షుడు ఖాదర్‌ వలి, రియాజ్‌ భాషా, అబ్దుల్లా, జాకీర్‌ హుస్సేన్‌, అబ్దుల్‌ రజాక్‌, రహంతుల్లా, సంస్థ సభ్యులు, కార్యకర్తలు, హిందూ, ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.